


కోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఊడిపడుతున్న పెచ్చులు



దినదినగండం..

నిత్యం ప్రజల రాకపోకలతో కిటకిటలాడే తహసీల్దార్ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఎక్కడ చూసినా పగుళ్లిచ్చిన గోడలు, కారుతున్న పైకప్పులు దర్శనమిస్తున్నాయి. స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండటంతో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు భయపడుతున్నారు. వర్షం వస్తే రికార్డులు తడిచిపోగా, కంప్యూటర్లలోకి నీరు చేరి మొరాయిస్తున్నాయి. నేటికీ బ్రిటిషు వారి కాలంలో నిర్మించిన భవనాల్లోనే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఎక్కువశాతం కార్యాలయాలు కొనసాగుతున్నాయి. దినదినగండంగా మారిన తహసీల్దార్ కార్యాలయాల భవనాల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్ కథనం.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయ భవనాలు

పగుళ్లిచ్చిన గోడలు.. కారుతున్న పైకప్పులు

- వర్షం వస్తే తడుస్తున్న రికార్డులు.. మొరాయిస్తున్న కంప్యూటర్లు
- ఊడి పడుతున్న పెచ్చులు.. పనిచేసేందుకు భయపడుతున్న ఉద్యోగులు
- నేటికీ బ్రిటిషు వారి కాలం నాటి భవనాల్లోనే కొనసాగింపు

కార్యాలయాలకు రావడానికి జంకుతున్న జనం



శిథిలమైన మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయ భవనం



కూలేందుకు సిద్ధంగా చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్): కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఇప్పటికీ అనేక చోట్ల బ్రిటీషు కాలం నాటి భవనాలనే తహసీల్దార్ కార్యాలయాలుగా ఉపయోగిస్తున్నారు. వీటికి మరమ్మతులు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. వీటిలో వర్షం పడితే తడిచిపోయే కార్యాలయాలు ఎన్నో ఉన్నాయి. స్లాబులు పెచ్చులూడి పోతున్నాయి. ఇలాంటి కార్యాలయాల్లో పనిచేసేందుకు ఉద్యోగులు భయపడుతున్నారు. ఒకటి, రెండు కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పునాదులు, మొండిగోడలతో ఏళ్ల తరబడి దర్శనమిస్తున్నాయి.

- బ్రిటిష్‌కాలం నాటి పాత భవనంలో జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయం నడుస్తోంది. భవనానికి మరమ్మతులు చేయించడం మినహా నూతన భవన నిర్మాణానికి ప్రయత్నాలు ఇప్పటి వరకు జరగలేదు. పాత భవనం కావడంతో వర్షం వస్తే లోనికి నీరు వస్తుంది. వర్షం పడకుండా పైన కవర్లు వేసి నడిపిస్తున్నారు. ఆవరణ అంతా అక్రమ రవాణాలో భాగంగా స్వాధీనం చేసుకున్న ఇసుక కుప్పలు, పిచ్చిచెట్లతో నిండిపోయి చిట్టడవిని తలపిస్తోంది. 2013లో వీఆర్వో భవన్ పేరిట కార్యాలయానికి ఒక పక్క నూతన భవనాన్ని నిర్మించారు. వీఆర్వోలు, ఆర్ఐలు అక్కడే పనిచేస్తున్నారు.
- రెండు దశాబ్దాల కిందట నిర్మించిన చందర్లపాడు తహసీల్దార్ కార్యాలయం మరమ్మతులకు గురైంది. బండలు కుంగిపోవడంతో ఉద్యోగులు, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.
- పెనుగంచిప్రోలు తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణం జరిగి 20 సంవత్సరాలు అవుతోంది. పలు చోట్ల స్లాబు పెచ్చులూడి కింద పడిపోతోంది. పనిచేయాల్సి రావటం తమకు ఇబ్బందిగా ఉందని కార్యాలయ సిబ్బంది వాపోతున్నారు. ఇక్కడ తాగునీటి సదుపాయం కూడా లేదు. రికార్డు రూమ్‌కు భద్రత కరువైంది. వర్షం వస్తే భవనం నుంచి నీరు లోపలికి వస్తోంది.
- నాగాయలంక తహసీల్దార్ కార్యాలయంలో మొదటి అంతస్తులో శ్లాబు పెచ్చులూడిపోయి మిగతా 6లో..

ఆంధ్రజ్యోతి ఫోకస్

- కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బ్రిటీషు కాలంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శిథిలమైంది. దీంతో భారీ వర్షం వచ్చిన రోజున ఫైళ్లు, కంప్యూటర్లు తడుస్తున్నాయి. భవనం నిర్మించి 110 ఏళ్లు అయినప్పటికీ విలువైన కలప చెక్క చెదరకుండా ఉంది. అయితే పైకప్పు బంగళా పెంకులతో నిర్మించడం వల్ల భారీ వర్షాల సమయంలో వర్షపునీరు లోపలకు వస్తోంది. కంప్యూటర్లు ఉండే ఒక గదిపైన సిబ్బంది పైకప్పుపై టార్పాలిన్‌లు పరిచారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో శిథిలమైన భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు రూ.90 లక్షల నిధులు కేటాయించారు. అప్పటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, అప్పటి మంత్రి కొల్లు రవీంద్ర, అప్పటి ఎంపీ కొనకళ్ల నారాయణరావు శంకుస్థాపన చేశారు. భవనం పునాదుల వరకు వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్ వల్ల భవన నిర్మాణం కొనసాగలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రస్తుతం బందరు మండలం సౌత్, నార్త్ మండలాలుగా విభజించినందు వల్ల ఎస్టిమేట్లు మార్చి రెండు కార్యాలయాలకు కావలసిన భవనాలను నిర్మించాల్సి ఉంది.



బందరులో పునాది దశలోనే నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనం

కృష్ణా యూనివర్సిటీ వీసీగా ఎవరు?

కృష్ణా యూనివర్సిటీ వీసీ పదవి ఎవరిని వరించబోతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ కారణాలతో అప్పటి వీసీ జి.జ్ఞానమణి ఆ పదవి నుంచి తప్పుకొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో పనిచేస్తున్న శ్రీనివాసరావును ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. నూతన వీసీగా ఎవరిని నియమించాలనే అంశంపై ప్రభుత్వం మూడు నెలలుగా కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరు నాటికి కృష్ణా యూనివర్సిటీ వీసీ ఎంపిక ప్రక్రియ కొలిక్కి రానుంది.

సెర్చ్ కమిటీ ద్వారా ఇప్పటికే ముగ్గురిపేర్లు ప్రతిపాదన

- ఈనెలాఖరు నాటికి వైస్ చాన్సలర్ నియామకం
- ఆరు నెలలుగా ఇన్‌చార్జి వీసీ పాలనలోనే వర్సిటీ
- రిజిస్ట్రార్ నియామకంపైనా సర్వత్రా ఉత్కంఠ



కృష్ణా యూనివర్సిటీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ వీసీ ఎంపికపై సెర్చ్ కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశమైంది. ముగ్గురి పేర్లను ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ ముగ్గురిలో ఒకరికి వీసీ పదవిని ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం యూనివర్సిటీలో రెక్టార్‌గా ఉన్న ఎంవీ బసవేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లాలోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీగా గతంలో పనిచేసిన కొన రాంజీ, కాకతీయ యూనివర్సిటీలో బోటనీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎంఎస్ రాజు పేర్లు సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సీఎం చంద్రబాబు ఈ ముగ్గురి పేర్లను పరిశీలించి ఒకరి పేరును వీసీగా నియమించాలని సిఫార్సు చేస్తూ గవర్నర్‌కు పంపితే అదే తుది నిర్ణయం కానుంది. ఏమైనా అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటేనే వేరే వారి పేరు బయటకు వస్తుందని యూనివర్సిటీ ప్రొఫెసర్లు చెప్పుకుంటున్నారు. యూనివర్సిటీ వీసీ పదవిని దక్కించుకునేందుకు తెరవెనుక ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

రిజిస్ట్రార్ నియామకం సంగతేంటి?

కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రస్తుతం శోభన్‌బాబు కొనసాగుతున్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో పనిచేస్తున్న ఆయన గత ఏడాది జనవరిలో కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఏడాది కాలం పాటు కొనసాగేలా అప్పటి ప్రభుత్వం నియమించింది. ఈనెలాఖరు నాటికి రిజిస్ట్రార్ పదవీకాలం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో ఆయనను కొనసాగిస్తారా లేక మాతృసంస్థకు పంపుతారా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. గత ఏడెనిమిది సంవత్సరాలుగా వేరే యూనివర్సిటీలలో పనిచేస్తున్న ప్రొఫెసర్లను కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్లుగా నియమించడం ఆనవాయితీగా వస్తోంది. రిజిస్ట్రార్‌లు స్థానికంగా నివాసం ఉండాల్సి ఉండగా, గతంలో నియమితులైన రిజిస్ట్రార్‌లంతా గుంటూరు, విజయవాడ, తదితర ప్రాంతాల నుంచి వస్తూ ఇక్కడే ఉంటున్నట్లు హెచ్‌ఆర్‌ఏ తీసుకోవడంపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఏడాది తర్వాత ఎటూ వెళ్లిపోతాం కదా అనే ఉద్దేశంతో రిజిస్ట్రార్‌లు యూనివర్సిటీ పరిపాలనపై దృష్టి సారించకపోవడం గమనార్హం. గతంలో పనిచేసిన రిజిస్ట్రార్‌లపై అనేక ఆరోపణలు రావడంతో వారిని బలవంతంగా మాతృసంస్థలకు పంపిన దాఖలాలు ఉన్నాయి. బయటి యూనివర్సిటీల నుంచి కృష్ణా యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌లను నియమించడంతో రిజిస్ట్రార్‌ల జీతం, ఇతర అలవెన్సుల రూపంలో నెలకు రూ.2.50 లక్షలకుపైగా యూనివర్సిటీపై ఆర్థికభారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం యూనివర్సిటీలో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్‌లలో ఒకరిని రిజిస్ట్రార్‌గా నియమించాలనే డిమాండ్ వర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్ల నుంచి వినిపిస్తోంది. యూనివర్సిటీ ఎంబీఏ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ మిగతా 6లో..



ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా కలెక్టర్ బాలాజీ

6లో

అమరావతికి శాశ్వతంగా వరద విముక్తికి చర్యలు

8లో

దివిలో ముందే గణతంత్ర వేడుకలు

నాగాయలంక, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వత్రోత్సవాలను మారుమూల ఉన్న దీవుల్లోనూ వైభవంగా నిర్వహించాలన్న కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశాలతో జిల్లాలోని దివి గ్రామాల సముదాయమైన ఎదురుమొండి దీవుల్లో గురువారం త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. గణతంత్ర దినోత్సవాన్ని కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే నిర్వహించటం ద్వారా పల్లె ప్రజలు వేడుకలకు దూరమవుతున్నారని, వారికి గణతంత్ర వేడుకలపై అవగాహన కూడా ఉండట్లేదనే తలంపుతో అధికార వ్యవస్థ మొత్తం కలిసికట్టుగా గ్రామాల్లో ముందస్తు వేడుకలు నిర్వహించాలని, తద్వారా ప్రజలకు స్వాతంత్ర్యం గురించి, గణతంత్రరాజ్యం గురించి వివరించాలని కేంద్ర రక్షణ మంత్రిత్వ ఆదేశించింది. దీంతో మండలంలోని ఎదురుమొండి దీవుల్లోని దివి గ్రామాల్లో తహసీల్దార్ హరనాథ్ నేతృత్వంలో గణతంత్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.



సీఆర్‌డీఏ కమిషనర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనర్‌గా కన్నబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చిన ఆయనకు అడిషనల్ కమిషనర్లు మల్లారపు నవీన్, జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన కన్నబాబు సీఆర్‌డీఏ అధికారులను పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత సీఆర్‌డీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశమయ్యారు. అమరావతి రాజధాని అభివృద్ధి ప్రాజెక్టు పనులకు సంబంధించిన అంశాలపై సమీక్ష చేశారు.



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కన్నబాబు

తాత, తండ్రి బాటలో నారా లోకేశ్

- లోకేశ్ జన్మదిన వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర 6లో



కృష్ణా వర్సిటీలో అవకతవకలపై విజిలెన్స్ విచారణ

ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మచిలీపట్నం, జనవరి23(ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్సిటీలో ఆర్థికపరమైన అంశాలలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. యూనివర్సిటీలో భవనాల నిర్మాణం జరగకుండానే గతంలో పనిచేసిన వీసీలు, రిజిస్ట్రార్‌లు రూ.25కోట్ల వరకు బిల్లులు చేయడం, ఇటీవల కాలంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, సీడీసీ విభాగాల నుంచి రూ.4 కోట్ల నిధులను మళ్లించడం, నాక్ బృందం వచ్చిన సమయంలో యూనివర్సిటీ ఖాతా నుంచి రూ.5 లక్షలను డ్రా చేయడం, యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి నగదు రూపంలో వసూలు చేయడంపై ఇటీవల యూనివర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్లు రెక్టార్ సమక్షంలో రిజిస్ట్రార్‌ను నిలదీశారు. దీంతో పాటు ప్రభుత్వానికి ఫిర్యాదు కూడా చేశారు. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 22న 'కృష్ణాయూనివర్సిటీలో వివాదాలు' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలపై విచారణకు ఆదేశించింది.

మూల్యాంకనం బిల్లులు రూ.78 లక్షలు విడుదల

కృష్ణా యూనివర్సిటీలో గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న జవాబు పత్రాల మూల్యాంకనం బిల్లులను గురువారం విడుదల చేసినట్లు ప్రొఫెసర్లు చెబుతున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను, యూనివర్సిటీ అకౌంట్స్ విభాగం అధికారులను పిలిపించిన వీసీ శ్రీనివాసరావు మూల్యాంకనం బిల్లులు రూ. 78 లక్షలను మంజూరు చేశారు.

భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని వినతి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం, ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ గురువారం కృష్ణాయూనవర్సిటీకి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్‌లు, సిబ్బంది ఎంతోకాలంగా నిలిచిపోయిన భవనాలను వారికి చూపించారు. రెండు సంవత్సరాలుగా యూనివర్సిటీలో భవనాల పనులు నిలిచిపోయాయని తెలిపారు. దీంతో నిర్మాణంలో ఉపయోగించిన ఇనుము తుప్పు పట్టిపోతోందని, దీని వల్ల నాణ్యత దెబ్బ తింటుందని వివరించారు. యూనివర్సిటీలో భవనాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఆలపాటి, ఏఎస్ రామకృష్ణ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



కలెక్టర్ బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, మచిలీపట్నం డీఎస్పీ చప్పిడి రాజా

ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా కృష్ణా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం/విజయవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ ఎంపికయ్యారు. 2024లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడం, నూతన ఓటర్లను చేర్పించడం, ఎన్నికల సంఘం సూచనలను తు.చ తప్పకుండా పాటించినందుకుగాను కలెక్టర్ బాలాజీని ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా ఎంపికచేస్తూ రాష్ట్ర ఎన్నికలసంఘం సీఈవో వివేక్ యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 25న 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీలు

ఇటీవల జిల్లాలో నూతనంగా నియమితులైన గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, మచిలీపట్నం డీఎస్పీ చప్పిడి రాజా గురువారం కలెక్టర్ బాలాజీని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలను అందజేశారు. శాంతిభద్రతలు పరిరక్షించడంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీఎస్పీలకు సూచించారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ లక్ష్మీశను బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపిక చేశారు. ఎస్ఎస్ఆర్-2024 తర్వాత ఓటర్ల జాబితాల రూపకల్పన, ఓటర్ల నమోదు కార్యక్రమాలు, ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను సమర్థవంతంగా లక్ష్మీశ నిర్వహించారు.



నారా లోకేశ్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి రవీంద్ర

తాత, తండ్రి బాటలో నారా లోకేశ్

- మంత్రి కొల్లు రవీంద్ర
- ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

మచిలీపట్నం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తాత ఎన్టీఆర్, తండ్రి నారా చంద్రబాబు నాయుడు బాటలో నడుస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకుని వెళ్లేందుకు మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం మచిలీపట్నం నియోజక వర్గంలో ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, నారా లోకేశ్ మానవ వనరుల శాఖా మంత్రిగా ఉంటూ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీల ద్వారా పెట్టుబడులు తెచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, బచ్చుల బోసు బాబు, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, మరకాని పరబ్రహ్మం, కరెడ్ల సుశీల, లంకిశెట్టి నీరజ, గండికోట అంజిబాబు, మాటూరి దీప, కుంబా చరణ్, జనసేన నాయకులు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ, తదితరులు

రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఆశాజ్యోతి : నెట్టెం

వన్‌టౌన్ : విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో గురువారం మంత్రి నారా లోకేశ్ 42వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, కృష్ణాజిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి కేక్‌లను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నెట్టెం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఆశాజ్యోతి నారా లోకేశ్ అని కొనియాడారు. రాబోయే తరానికి ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలని ఆయన పడుతున్న తపన శ్లాఘనీయమన్నారు. కొనకళ్ల మాట్లాడుతూ, ఏ పార్టీలో లేనివిధంగా పార్టీ కార్యకర్తలకు కష్టమొచ్చినా, చనిపోయినా వారి కుటుంబసభ్యులకు బీమా మొత్తం, పిల్లలకు ఉచిత విద్య అందేలా పార్టీ ప్రణాళికను రూపొందించారన్నారు. లుక్కా సాయిరామ్ గౌడ్, గన్నే ప్రసాద్, వాసం మునియ్య, శొంటి శివ ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, బంకా నాగమణి, కోగంటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేశినేని చిన్ని కార్యాలయంలో..

కేక్ కట్ చేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని



గురునానక్ కాలనీలోని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, గత ప్రభుత్వ అరాచక విధానాలను నిగ్గదీసి ఎండగట్టి ప్రజలకు అండగా నిలిచి ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో లోకేశ్ కీలక పాత్ర వహించారన్నారు. కేక్ కట్ చేసి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గొట్టుముక్కల రఘురామరాజు, చెన్నుపాటి ఉషారాణి, తాడి శకుంతల, కోగంటి రామారావు, నరసింహచౌదరి, తూమాటి ప్రేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేశినేని శివనాథ్ సొంత నిధులతో జిల్లాలోని 145 ప్రభుత్వ పాఠశాలలో క్రీడ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చదివిన గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో నారా లోకేష్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా కిట్లను పంపిణీ ప్రారంభించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా కిట్లను అందచేసి పాఠశాలల మైదానాలను అభివృద్ధికి కృషి చేసిన శివనాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ భానుమూర్తి, ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ హెడ్ మాస్టర్ మల్లికార్జునరెడ్డి, టీడీపీ నాయకుడు ఫతావుల్లా, గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీటి కష్టాలు!



ఎక్స్‌కవేటర్ సహాయంతో కృష్ణా ప్రవాహాన్ని ఎత్తిపోతల పథకాల వైపు మళ్లిస్తున్న రైతులు,

చింతలపాడులో అన్నదాత భగీరథ ప్రయత్నంతో ఇన్‌టెక్ వెల్‌కు చేరుతున్న నీరు

- ఎత్తిపోతల పథకాలకు చేరని నీరు
- ఎండుతోన్న పంటలతో అన్నదాత అవస్థలు
- సప్లయి ఛానళ్ల ద్వారా పంటలకు తరలింపు

నందిగామ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పంటను కాపాడుకునేందుకు ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి కృష్ణానీటిని పథకాలకు మళ్లిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని పలు నియోజకవర్గాలలో కృష్ణానదిపై పెద్దఎత్తున ఎత్తిపోతల పథకాల నిర్మాణం జరిగింది. ఆయా ఆయకట్టులో రైతులు వాణిజ్య ఆహార పంటలు సాగుచేస్తున్నారు. తొలకరి బాగున్నప్పటికీ ఆయకట్టు రైతులు పలు ఆటుపోటులు ఎదుర్కొంటున్నారు. నిన్నమొన్నటి వరకూ వరదలతో భీతిల్లిన అన్నదాతలు నేడు పంటలకు నీరందక ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు పకృతి వైపరీత్యాలతో పోరాడుతూనే మరోవైపు సాగు నీటి కోసం ఆరాటపడుతున్నారు. ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో మిర్చి, మాగాణి పంటలకు ప్రస్తుతం నీటి అవసరాలు ఉన్నాయి. ఒక్కసారిగా కృష్ణానదికి ఎగువ నుంచి నీటి విడుదల నిలిపివేయడంతో సాగునీటి పథకాలకు నీరందడం లేదు. ప్రవహిస్తున్న కొద్దిపాటి నీరు గుంటూరు జిల్లా వైపు వెళుతుంది. పథకాల ఇన్‌టెక్‌వెల్‌కు నీరందకపోవడంతో నీటికోసం పంటలు నోర్లు తెరుకున్నాయి. కళ్ల ఎదుటే పంటలు ఎండిపోతుంటే చూడలేని రైతాంగం ఆవేదన చెందుతోంది. నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని వారు చేసిన విజ్ఞప్తులను అధికారులు పట్టించుకోలేదు. దీంతో నడుంబిగించిన అన్నదాతలు గుంటూరు జిల్లా వైపు ప్రవహిస్తున్న నదీ ప్రవాహాన్ని సప్లై చానళ్ల ద్వారా పథకాల వైపునకు మళ్లిస్తున్నారు. ఆర్థిక భారాన్ని సైతం లెక్క చేయకుండా అపర భగీరథులై కృష్ణ నీటిని పథకాల ఇన్‌టెక్ వెల్‌కు అందిస్తు పంటలను కాపాడుకుంటున్నారు. అయినప్పటికీ సమర్థవంతంగా పథకాలకు నీరు చేరడం లేదు. లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగునీటి కోసం తపిస్తున్న అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉంది. తెలంగాణ అధికారులతో మాట్లాడి చెర్వుమాధవరం ట్యాంక్ నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేయిస్తే సాగుకు మేలు జరుగుతుంది. ఈ సమస్యపై స్పందించిన ఎన్ఎస్‌పీ అధికారులు మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ఈ సమయంలో నీరు విడుదల చేయాలంటే డెల్టా ప్రాంతం నుంచి విజ్ఞప్తి రావాల్సి ఉందన్నారు. వారి అవసరాలకు మాత్రమే నీరు విడుదల చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యేలు, మంత్రులు స్పందించి డెల్టా అధికారులు, తెలంగాణా అధికారులతో సంప్రదింపులు జరిపి కనీసం రెండు టీఎంసీల నీటిని విడుదల చేయించాలని రైతులు కోరుతున్నారు.

వంశీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చెల్లదు

- భిన్న ఉత్తర్వుల నేపథ్యంలో వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేయండి
- వంశీ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు
- సీనియర్ న్యాయవాది వాదనను వ్యతిరేకించిన పీపీ
- ఐఏపై కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థన
- విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి సమయంలో నిందితుడు వల్లభనేని వంశీ అక్కడలేరని, దాడి ఘటనలో నేరుగా పాల్గొనందున ఆయనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చెల్లుబాటు కాదని వంశీ తరఫు సీనియర్ న్యాయవాది పట్టాభి గురువారం హైకోర్టులో వాదనలు వినిపించారు. నిందితుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైనప్పుడు ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు వద్ద మొదట ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవాలని ఓ బెంచ్, చట్టం వర్తింపుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లేనప్పుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు నేరుగా విచారించవచ్చని మరో బెంచ్ భిన్న ఉత్తర్వులు ఇచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేయాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. అనుబంధ పిటిషన్‌కు(ఐఏ)కు విచారణార్హత లేదన్నారు. ఇదే కేసులో పలువురు నిందితులు హైకోర్టులో నేరుగా ముందస్తు బెయిల్ పిటిషన్లు వేయడాన్ని ఇదే కోర్టు తప్పుపట్టిందన్నారు. ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు ముందు పిటిషన్లు వేసుకొనేందుకు వెసులుబాటు ఇచ్చిందన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టంలోని సెక్షన్ 14(ఏ) ప్రకారం ప్రత్యేకకోర్టు నిర్ణయంపై హైకోర్టులో అప్పీల్ మాత్రమే దాఖలు చేసుకోగలరన్నారు. ఈ తీర్పుకి భిన్నంగా పిటిషనర్ విషయంలో ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదన్నారు. ఐఏ పై కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

దినదినగండం..

(5వ పేజీ తరువాయి)

కిందపడుతోంది. ఇటీవల పెచ్చులు ఊడిపోయినపుడు సందర్శకులకు తృటిలో ప్రమాదం తప్పింది. పెచ్చులూడిన ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ పనులు కూడా చేయించకపోవటం గమనార్హం.

- బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. రెండు దశాబ్దాల కంటే ముందుగానే నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎక్కడికక్కడ తహసీల్దార్ కార్యాలయం నెర్రలిచ్చిపోతోంది. నెర్రలిచ్చిన చోట పిచ్చి మొక్కలు మొలిచి ఏపుగా పెరుగుతున్నాయి. ఈ భవనం ఏ క్షణంలో కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.
- ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగించాల్సి రావడంతో అప్పటి నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని పాత భవనంలో అద్దె ప్రాతిపదికన కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యలయం స్లాబు, గోడలు పెచ్చులూడిపోయి కూలటానికి సిద్ధంగా ఉన్నాయి. పగుళ్లిచ్చిన చోట సిమెంట్ రాసినా వేరే చోట పగుళ్లు వస్తున్నాయి. ఇలా ఎక్కడ పడితే అక్కడ పగుళ్లతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో తహసీల్దార్ కార్యాలయం ఉంది.
- గన్నవరం తహసీల్దార్ కార్యాలయం బ్రిటీషు కాలంలో నిర్మించిన భవనంలోనే ఇప్పటికీ కొనసాగుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఉమ్మడి కృష్ణా జేసీ విజయకృష్ణన్ ప్రత్యేక చొరవ చూపి గన్నవరంలో రెండు అంతస్థుల రెవెన్యూ కాంప్లెక్స్ పనులు చేపట్టారు. పిల్లర్లు, శ్లాబులు పూర్తయ్యాయి, కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించలేదు. పనులు ఆగిపోయాయి. ఇప్పటికీ అసంపూర్ణంగా ఉంది.
- బాపులపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించి మూడు దశాబ్దాలు కావస్తోంది. కార్యాలయంలోని ఫ్లోరింగ్ అంతా కుంగిపోయింది. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. భవనంపై మొక్కలు పెరిగాయి. తహసీల్దార్ కూర్చునే గదిలోనే గోడలు బీటలు వారి ఉన్నాయి. వర్షం పడితే నీరు కారుతోంది.

కృష్ణా యూనివర్సిటీ వీసీగా ఎవరు?

(5వ పేజీ తరువాయి)

జయశంకరప్రసాద్‌ను రిజిస్ట్రార్‌గా నియమించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఈ నెల 5వ తేదీన యూనివర్సిటీ వీసీ కూడా ప్రొఫెసర్ల వద్ద ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్రస్తుత రిజిస్ట్రార్ పదవీకాలం పూర్తి కానుండటంతో ఆయననే కొనసాగిస్తారా లేక స్థానికంగా పనిచేసే ప్రొఫెసర్లలో ఒకరిని రిజిస్ట్రార్‌గా నియమిస్తారా అనే అంశంపైనా చర్చ జరుగుతోంది. కృష్ణాయూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ల నియామకం ఈనెలాఖరునాటికి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

చేనేత పరిశ్రమను ఆదుకోండి

- చేనేత కార్మిక సంఘం నేత సజ్జా నాగేశ్వరరావు



పెడన, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చేనేతకు బడ్జెట్‌లో రూ. 2వేల కోట్లు కేటాయించాలని, చేనేతపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని, నేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సీనియర్ నేత సజ్జా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. చేనేత రంగంలో రిజర్వేషన్ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, బోగస్ సహకార సంఘాలను రద్దు చేయాలని, సక్రమంగా పనిచేస్తున్న సంఘాలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. చేనేత పరిశ్రమ సంక్షోభంలో పడటంతో పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మచిలీపట్నంలోని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ కార్యాలయంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం కృష్ణాలు పాల్గొన్నారు.

ఏషియన్ యోగాలో భాష్యం విద్యార్థికి స్వర్ణం



ధీరజ్ శ్రీకృష్ణను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : భాష్యం విద్యార్థులు చదువుతోపాటు ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం గర్వంగా ఉందని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఇటీవల సింగపూర్‌లో జరిగిన యోగ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన 9వ తరగతి విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ అభినందన కార్యక్రమంలో భాగంగా గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి మూడు రోజులపాటు సింగపూర్‌లో జరిగిన ఏషియన్ యోగ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ధీరజ్ కృష్ణ ఒక పసిడి, రెండు రజిత, ఒక కాంస్య పతకం సాధించినట్టు తెలిపారు. జూనియర్ విభాగంలో ధీరజ్ శ్రీకృష్ణ ఆర్టిస్ట్ యోగాలో పసిడి పతకం, యోగాసన ఆర్టిస్ట్ పెయిర్ యోగాలో రజిత పతకం, రిథమిక్ యోగాలో కాంస్య పతకాలు సాధించినట్టు తెలిపారు. భవిష్యత్తులో జరిగే ఒలింపిక్ పోటీల్లో యోగా ప్రవేశపెట్టిన నేపథ్యంలో విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ ప్రపంచస్థాయి గుర్తింపు సాధిస్తాడని భాష్యం రామకృష్ణ ఆకాంక్షించారు. ధీరజ్ శ్రీకృష్ణ మాట్లాడుతూ, యోగాలో ప్రతిభ చూపుతున్న తనకు రూ.లక్ష ప్రోత్సాహకం చైర్మన్ భాష్యం రామకృష్ణ అందజేశారని తెలిపారు.

మెడికల్ కళాశాలలో 142 పోస్టులకు 5320 దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల పరిధిలో 27 కేటగిరీలకు చెందిన 142 (కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్) పోస్టుల భర్తీకి చివరిరోజైన గురువారం నాటికి మొత్తం 5320 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి స్క్రూటినీ అనంతరం ఫిబ్రవరి 15న ప్రొవిజనల్ లిస్టు ప్రదర్శిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డి.టి.కె. రెడ్డి తెలిపారు. 16, 17 తేదీల్లో జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం తిరిగి 24న మరొక ప్రొవిజినల్ లిస్టును ప్రకటిస్తామన్నారు. మళ్లీ అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ పరిశీలించి ఫిబ్రవరి 28న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు వికలాంగులు, మాజీ సైనికుల రిజర్వేషన్‌ను పాటిస్తూ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ పోస్టుల భర్తీకి దళారీల మాటలు నమ్మవద్దని ప్రిన్సిపాల్ తెలిపారు.

ధర తగ్గుతున్న సుబాబుల్!

వైసీపీ హయాంలో పతనం.. కూటమి ప్రభుత్వం రాకతో ఊరట

- మద్దతు కూడా లభించక రైతుల ఆందోళన
- నానాటికీ దిగజారుతున్న ధర

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

సుబాబుల్ కర్ర ధర తగ్గటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టన్నుకు రూ.ఐదు వందలు తగ్గింది. మిల్లుల వద్ద కర్ర నిల్వలు పుష్కలంగా ఉండటం, డిమాండ్‌ను మించి సరఫరా ఎక్కువ కావటం వల్ల ధర తగ్గిందని దళారులు చెబుతుండగా, మిల్లుల ప్రతినిధులు, దళారులు కుమ్మక్కై కావాలని ధర తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు.

వైసీపీ పాలనలో సుబాబుల్ రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. గిట్టుబాటు ధర సంగతి దేవుడెరుగు? మద్దతు ధర కూడా లభించలేదు. మద్దతు ధర టన్నుకు రూ.4,400 ఖర్చులు పోను రైతుల చేతికి నికరంగా రూ. 3,500 నుంచి రూ. 3,600 అందాయి. అలాంటిది ఒక దశలో టన్నుకు రూ. 1,500 లభించటం గగనమైంది. రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీ అప్పట్లో పాలకులు అణుమాత్రం కూడా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల సమయంలో సుబాబుల్ ధరలో కదలిక వచ్చింది.

కూటమి ప్రభుత్వంలో ఊహించని ధర..

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఊరట లభించింది. ఊహించని విధంగా కర్ర ధర పెరిగింది. గత డిసెంబరు నెలలో రైతుల చేతికి రూ. 7,200 నుంచి రూ. 7,400 అందాయి. ఎందువల్లనో కొద్ది రోజుల నుంచి మార్కెట్లో ధర దిగజారుతోంది. పక్షం రోజుల క్రితం వరకు రూ. 7,000 వచ్చాయి. ప్రస్తుతం రైతులకు రూ.6,500 మాత్రమే అందుతున్నాయి. ధర ఎందుకు తగ్గుతుందో రైతులకు అర్థం కావటం లేదు. పేపరు మిల్లులు ధర తగ్గించాయా లేక దళారులు .తగ్గిస్తున్నారా అన్నది తెలియటం లేదు. ప్రతి రోజూ ఈ ప్రాంతం నుంచి ఏపీపీఎం (రాజమండ్రి), ఐటీసీ (భద్రాచలం), ఎస్‌పీఎం (సిర్పూర్ కాగజ్ నగర్) బలార్షా మిల్లులకు కర్ర సరఫరా అవుతున్నది.



సుబాబుల్ కర్ర లారీకి లోడింగ్

దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

రైతులు నేరుగా మిల్లులకు అమ్మటం లేదు. డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ రైతులు ఎక్కువగా దళారులను ఆశ్రయిస్తున్నారు. కర్ర నరికే కూలీలందరూ దళారుల అధీనంలో ఉన్నారు. రైతులు సొంతంగా కర్ర నరికించేందుకు కూలీలు దొరకటం లేదు. మరో గత్యంతరం లేక దళారులపైన ఆధారపడాల్సి వస్తున్నది. దళారులు టన్నుకు రూ. 6,500 వంతున చెల్లించి, మిల్లులకు సరఫరా చేస్తున్నారు. కర్ర నిల్వలు పుష్కలంగా ఉండటం వల్లనే మిల్లులు ధర తగ్గించాయని దళారులు చెబుతున్నారు. ఈ విషయం అంత నమ్మశక్యంగా లేదని రైతులు పేర్కొంటున్నారు.

కలవరపెడుతున్న ధర

సుబాబుల్ ధర ఇంకా పెరుగుతుందన్న ఆశతో ఉన్న రైతులను ధర తగ్గటం కలవర పరుస్తున్నది. వైసీపీ పాలనలో ధర దారుణంగా పడిపోయినపుడు ఎక్కువ మంది రైతులు సుబాబుల్ తోటలు తొలగించి, ఇతర పంటలు సాగు చేశారు. గత ఏడాది ధర అనూహ్యంగా రికార్డు స్థాయిలో పెరగటతో రైతులు సుబాబుల్ సాగుపై దృష్టి పెట్టారు. పేపరు మిల్లులు కూడా పరోక్షంగా ప్రోత్సహించాయి. దీంతో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో సుబాబుల్ తోటల విస్తీర్ణం పెరిగింది. అలాంటిది ధర తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డిమాండ్ ఉన్నప్పటికీ మిల్లుల ప్రతినిధులు, దళారులు కల్సి కావాలని ధర తగ్గిస్తున్నారన్న అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

నేడు గీత కులాల మద్యం షాపులకు పాటలు

మచిలీపట్నం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో గీత కులాల వారికి కేటాయించిన 12 మద్యం షాపులను శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో లాటరీ తీస్తారని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి జి. గంగాధరరావు తెలిపారు. గౌడ, శెట్టిబలిజ కులాల వారికి 12 మద్యం షాపులు కేటాయించామన్నారు. లాటరీలో తీసిన మద్యం షాపుల వారికి ఫిబ్రవరి 2న షాపులను కేటాయిస్తామన్నారు.

ఉపాధ్యాయుడికి రూ. 32 లక్షల జరిమానా

మచిలీపట్నం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కళాకారుడు వెంకటనరసింహం నుంచి ఉపాధ్యాయుడు పెద్ది శ్రీనివాసరావు 2018లో రూ. 18 లక్షల రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో నరసింహారావు కోర్టును ఆశ్రయించాడు. వాద ప్రతివాదనలు విన్న అనంతరం సీనియర్ సివిల్ జడ్జి పద్మ రూ.18 లక్షలకు వడ్డీతో కలిపి రూ. 32 లక్షల 80 వేలు శ్రీనివాసరావు చెల్లించాలని తీర్పు చెప్పారు.

26న కొండాలమ్మ ఆలయం వద్ద మాంసాహారం తినొద్దు

గుడ్లవల్లేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన (ఆదివారం) ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వేమవరం కొండాలమ్మ దేవస్థానం వద్ద మేకలు, కోళ్లు తినొద్దని ఆలయ ఈవో ఎ.కొండలరావు ప్రకటించారు. భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

నియోజకవర్గస్థాయి క్విజ్ పోటీలు రేపు

ఉంగుటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెదఅవుటపల్లిలోని శ్రీసాయి శ్రీనివాసా హైస్కూల్‌లో ఈనెల 25న ఉదయం నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కేజీఎస్ సాయిబాబా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన తల్లిదండ్రులైన కొండవీటి శ్రీనివాసరావు, శకుంతల జ్ఞాపకార్థం ఈ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనవచ్చునని, ప్రతి పాఠశాలలో 8నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులెవరైనా ఇద్దరు ఒక టీంగా ఏర్పడి పాల్గొనాలని తెలిపారు. విజేతలకు నగదు బహుమతితోపాటు, ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. వివరాలకు 8309333343 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



చెస్ విజేతలతో ఎంపీ కేశినేని శివనాథ్

చెస్ విజేతలకు నగదు బహుమతులు

గన్నవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన బొబ్బా రత్నారావు మెమోరియల్ చెస్ టోర్నమెంట్ విజేతలకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నగదు బహుమతులను అందజేశారు. గురువారం విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో చెస్ అంతర్జాతీయ కోచ్ వీఆర్ బొబ్బా ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్ విజేతల అభినందన సభ జరిగింది. విజేతలకు ఎంపీ కేశినేని శివనాథ్ మొత్తం రూ.1.12లక్షల బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో చిరాగ్ కొమ్మినేని విజేతగా నిలిచారు. సెకండ్ విన్నర్ శౌర్య కొండూరు, థర్డ్ విన్నర్‌గా హర్షిత సాయి గెలిచారు. అధ్యక్షుడు బొబ్బా శ్రీనివాస్ కుమార్, కార్యదర్శి ఎస్. సుజాత తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్, ఫర్నీచర్ వితరణ



ఉయ్యూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు ఉయ్యూరు శాఖ ఆధ్వర్యంలో రూ. 70వేలు విలువచేసే కంప్యూటర్, యూపీఎస్, ఇనుపబీరువా, ఇతర ఫర్నిచర్ గురువారం అందచేశారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి. చందన్, బ్రాంచి మేనేజర్ జె కిరణ్‌కుమార్ అన్నారు. పాఠశాలకు అవసరమైన కంప్యూటర్, ఫర్నీచర్ అందచేయడం పట్ల హెచ్ఎం కె జ్యోత్స్నదేవి, విద్యాకమిటీ చైర్మన్ శివసాయి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ బి. వీరాంజనేయులు, ఉపాధ్యాయుడు బలే ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌కు మొక్కలు అందజేత

హనుమాన్‌జంక్షన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు జడ్పీ హైస్కూల్‌కు జంక్షన్ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు రూ.5వేలు విలువ చేసే మొక్కలను పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావుకు గురువారం అందించింది. బ్యాంక్ సిబ్బంది పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఏరియా మేనేజర్ ఎంఎల్ఎన్ మూర్తి, బ్యాంకు సిబ్బంది , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనమలూరు నియోజకవర్గ

సబ్ జోన్ ఆటల పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం పద్మావతి భాయ్, సబ్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు

కంకిపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గ సబ్ జోన్ పోటీలను గురువారం ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పద్మావతి భాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మావతి భాయ్ మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, ఖో - ఖో, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, షటిల్, సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో సబ్ జోన్ అధ్యక్షులు ఎం. భవాని, సెక్రటరి వై. మురళీ, పెనమలూరు సబ్‌జోన్ పరిధిలోని ఫిజికల్ డైరెక్టర్లు ఈ క్రీడలకు రిఫరీలుగా వ్యవహరించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఉయ్యూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నియమ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి ప్రమాదాలకు తావులేకుండా గమ్యానికి చేరాలని ఉయ్యూరు ఆర్టీవో సుబ్బారావు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ట్యాక్సీ స్టాండ్ వద్ద కారు, ఆటో ఇతర వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతపై డ్రైవర్లకు ఎంవీఐ ఆయేష పలు సూచనలు చేశారు.

గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం

కంకిపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలంటూ తహసీల్దార్ భవన్నారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షులుగా కోలవెన్ను వీఆర్‌వో మల్లిఖార్జునరావు, ఉపాధ్యక్షులుగా విజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఈడుపుగల్లు వీఆర్వో చైతన్య, మహిళ సంయుక్త కార్యదర్శిగా దుర్గారావమ్మ, కార్యవర్గ సభ్యులుగా డేవిడ్ రాజు, కొండబాబు, సుబ్బారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తోపుడు బండ్లు అందజేత

ఉయ్యూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపక్కన వ్యాపారం చేస్తున్న ఇద్దరు మహిళలకు తోపుడుబండ్లు, వ్యక్తికి ఇస్త్రీ బండి రోటరీ సర్వీస్ ట్రస్టు సహకారంతో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నాగసుబ్రహ్మణ్యం, రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టు సెక్రటరీ వసంతరావు, క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఎం.సంపత్‌కుమార్, అనీస్, అమీర్ మీర్జా, సాయిసుబాష్ పాల్గొన్నారు.



అన్న సమారాధన కమిటీ సభ్యులకు ఎన్నారైల చెక్కును అందిస్తున్న ఎన్నారైల ప్రతినిధులు

అయ్యప్ప అన్నసమారాధనకు

పెనమలూరు ఎన్నారైల విరాళం

పెనమలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పుట్టిపెరిగిన గ్రామంలో నిర్వహించనున్న ధార్మిక కార్యక్రమానికి పెనమలూరు ఎన్నారైలు తమ చేయూతను అందించారు. పెనమలూరు గ్రామంలో ఈనెల 26న జరగనున్న 45వ అయ్యప్ప స్వామి అన్న సమారాధన కార్యక్రమానికి పెనమలూరు ఎన్నారైలు(అమెరికా) అన్నదానానికి అవసరమైన బియ్యానికి రై. 1,94,550ల సొమ్మును అమెరికాలో సేకరించి స్వగ్రామానికి పంపారు. ఈ మొత్తాన్ని ఎన్నారై స్థానిక ప్రతినిధులు గురువారం కార్యక్రమ నిర్వాహకులకు అందజేశారు. ఎన్నారై ప్రతినిధులు మోర్ల నరేంద్ర బాబు, కిలారు ప్రవీణ్, పాలడుగు సుధీర్, అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు ముప్పాళ్ల పూర్ణచంద్రరావు, జాస్తి పూర్ణరావు, దాసరి సాంబ, చాగంటిపాటి అల్లు తదితరులు పాల్గొన్నారు.







గన్నవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు , తాడిగడపలో కేక్ కట్ చేస్తున్న బోడె హేమ చౌదరి, కంకిపాడు పార్టీ కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుకలు

రాష్ట్ర దశ, దిశ మార్చనున్న మంత్రి లోకేశ్

గన్నవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దశ, దిశ మార్చేందుకు మంత్రి నారా లోకేశ్ విశేష కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం లాగా యువగళం ముందు, యువగళం తరువాత అన్నట్లు లోకేశ్ పాదయాత్ర సాగిందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. గన్నవరం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ 42వ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. 42కేజీల భారీ కేకును కట్ చేశారు. టీడీపీ జీవితకాలం సభ్యత్వంను యార్లగడ్డ నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల కిలో మీటర్ల పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్నారని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెనమలూరు: మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు పెనమలూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడప గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు లోకేష్ జన్మదినం సందర్భంగా కేక్‌లు కోసి వేడుకలు నిర్వహించారు. పోరంకి ప్రధాన కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ ఆధ్వర్యంలో కేక్ కోసి సంబరాలు జరిపారు. తాడిగడప మహాలక్ష్మీ మాను సెంటరు వద్ద జరిగిన వేడుకల్లో బోడె హేమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ తాడిగడప అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర బాబు, టీడీపీ పెనమలూరు అధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్ పాల్గొన్నారు.

పెదపులిపాకలో ..

పెదపులిపాకలో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సంగెపు రంగారావు, ముసునూరు శ్రీనివాసరావు, బుజ్జర్లపూడి బాబూరావు, గుంటూరు విశ్వేశ్వరరావు, పోలవరపు నరేంద్ర కుమార్, మంచాల శ్రీధర్, కనకమేడల మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మంత్రి లోకేశ్ జన్మదినం పురస్కరించుకొని టీడీపీ బాపులపాడు మండలం కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, మండల కార్యదర్శి పుట్టా సురేష్, పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి, పెరికీడు, తిప్పనగుంట, రంగన్నగూడెం, మల్లవల్లి, కొత్తపల్లి, బొమ్ములూరు తదితర గ్రామాల్లో గురువారం నారా లోకేశ్ 42వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీరవల్లి టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో కూడలిలో ఏర్పాటు చేసిన కేక్‌ను గుండపనేని ఉమావరప్రసాద్, ఉపసర్పంచ్ అజయ్‌కుమార్ కట్ చేశారు.

పెరికీడు టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ వేగిరెడ్డి పాపారావు, ముచ్చర్ల గిరిబాబు కట్ చేశారు. తిప్పనగుంటలో కొమ్మారెడ్డి రాజేష్, పవన్, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో, రంగన్నగూడెంలో ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా వేణుగోపాల్, యెనిగళ్ల శేఖర్ ఆధ్వర్యంలో, కొత్తపల్లిలో అధ్యక్షుడు వల్లూరిపల్లి నాని, అక్కినేని రవి ఆధ్వర్యంలో, మల్లవల్లిలో యనమదల వెంకయ్యారావు, అక్కినేని కృష్ణాజీ ఆధ్వర్యంలో, బొమ్ములూరు, కోడూరుపాడు, కాకులపాడు, తదితర గ్రామాల్లో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కంకిపాడు: స్థానిక టీడీపీ ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, సుదిమళ్ల రవీంద్ర, గోగినేని వెంకరమణ, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయ, చలవాది రాజ, వణుకూరు విక్రం పాల్గొన్నారు. గోసాల టీడీపీ ఆధ్వర్యంలో గోసాల వృద్ధాశ్రమంలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను ఆ గ్రామ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం చేశారు.

పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ



జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో...

నేతాజీ త్యాగనిరతి స్ఫూర్తిదాయకం

హనుమాన్‌జంక్షన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేసి యువకుల్లో స్వాతంత్ర్య పోరాటం పిపాసను రగిలించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశానికి అందించిన త్యాగపూరిత సేవలు యువతరానికి స్ఫూర్తిదాయకమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో నేతాజీ జయంతి వేడుకను నిర్వహించారు. నేతాజీ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ బీఫార్మశీ విద్యార్థిని బాపులపాడు గ్రామానికి చెందిన దేదీప్యకు కాలేజీ ఫీజులు నిమిత్తం మానవత సంస్థ రూ.10వేలు ఆర్థిక సాయం అందించింది. కార్యక్రమంలో మానవత జంక్షన్‌శాఖ అధ్యక్షుడు గూడపాటి జయ రామచంద్రరావు, కార్యదర్శి పాబోలు గణేష్, కోశాధికారి గంటా ఇందిరాదేవి, నాయకులు సత్యనారాయణ, సూర్యనారాయణ, రామచంద్రరావు, పీవీ.చలం, పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఆజాద్‌హింద్‌ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. సుభాష్ చంద్రబోస్ 128 జయంతి పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జబర్లపూడి సర్పంచ్ సూరపనేని శేష వరప్రసాద్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఏవో శివశంకర రావు, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ...

ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర సాధనకు సుభాస్‌చంద్రబోస్ పోరాటాలను అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు గుర్తుచేశారు. కార్యవర్గ సభ్యులు బాపిరాజు, తులసీరామ్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రుద్రయ్య పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్

ఉత్తమ వ్యవసాయ పద్ధతులపై అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఉత్తమ వ్యవసాయపద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తూ నాణ్యమైన దిగుబడి సాధించేందుకు సాయపడటమే పొలంబడి లక్ష్యమని ఏవో భవాని తెలిపారు. కాకులపాడులో మినుము పంటను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించి పల్లాకు తెగులు, బూడిద తెగుళ్లను గుర్తించడంపై రైతులకు అవగాహన కల్పించారు. తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి నాణ్యమైన దిగుబడి సాధించాలని ఏవో అన్నారు. వీఏఏలు, మోహనరావు, సూరపనేని ఆనంద్‌బాబు, ఆట్లూరి వెంకయ్య, శ్రీకాంత్, కిరణ్‌కుమార్, తదితర రైతులు పాల్గొన్నారు.



కాకులపాడు పొలంబడిలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారి భవాని

పశుపోషకుల ఆర్థికాభ్యున్నతే లక్ష్యం

ఉంగుటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకుల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తేలప్రోలు, మానికొండ పశువైద్యశాలల్లో పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. తేలప్రోలులో ఏర్పాటుచేసిన పశుఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ లాం దిబోరాతో కలిసి వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించగా, మానికొండలో శిబిరాన్ని టీడీపీ గ్రామ నాయకుడు ఆరికట్ల రవికుమార్ ప్రారంభించారు. తేలప్రోలు, ఇందుపల్లి పశువైద్యాధికారులు డాక్టర్ సీహెచ్ మల్లిబాబు, డాక్టర్ జి.సుధీర్‌బాబుల నేతృత్వంలో లేగదూడలు, జీవాలకు నట్టల నివారణ మందు తాగించారు. ఆవులు, గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గొర్రెలు, మేకలు, కోళ్లకు నులిపురుగుల నివారణ మందులతోపాటు, వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పశువిజ్ఞాన సదస్సులో గన్నవరం డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ వి.గోపీచంద్ పశుపోషకుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలపై అవగాహన కల్పించారు. అల్లాపురం ప్రాంతీయ పశువైద్యశాల సహాయసంచాలకులు డాక్టర్ ఎం.వీ.బాలకృష్ణారావు మినీ గోకులం షెడ్ల ప్రాధాన్యత, ప్రయోజనాలు, ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, ఉపాధిహామీ నిధులతో బహువార్షిక పశుగ్రాసాల సాగు, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అందించే వైద్యసేవలను వివరించారు. అనంతరం పశుఆరోగ్య విజ్ఞానంపై ముద్రించిన బ్రోచర్లను పశుపోషకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానికొండ వీఎల్‌వో ఎస్.శ్రీనివాసు, వెల్దిపాడు, తరిగొప్పుల జేవీవోలు రమాదేవి, ఫణికుమార్, వీఏలు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం శ్రీనివాసరావు, ఏహెచ్‌ఏలు శివ, హుస్సేన్, నాగబాబు, ల్యాబ్ టెక్నీషియన్ ఆశాజ్యోతి, స్థానిక టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పశువులకు వ్యాపించే వివిధ రకాల వ్యాధుల పట్ల పోషకులు అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్తతోనే వ్యాధుల నివారణ సాధ్యమని డాక్టర్ దుర్గాభవాని, డాక్టర్ దివ్య వేర్వేరు కార్యక్రమాల్లో సూచించారు. సింగన్నగూడెం, ఆరుగొలను గ్రామాల్లో గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి నివారణకు, జీవాలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. సింగన్నగూడెంలో ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణారావు, పాలకేంద్రం అధ్యక్షుడు మరీదు తిరుపతిరావు, పర్వతనేని రాజా, బాబూరావు, సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు. ఆరుగొలనులో పాల సొసైటీ అధ్యక్షుడు వీరం రాంబాబు, రామకృష్ణ,జిలానీ, దివ్య సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని గొడవర్రు, నెప్పల్లి గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి రవి కుమాంర్, ఎస్‌వీఎస్ రంగారావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పశువులకు ఉచితంగా వైద్యం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



తేలప్రోలులో బ్రోచర్‌ను పశుపోషకులకు అందజేస్తున్న పశువైద్యాధికారులు

రాష్ట్రానికి ఐదు 'జైవిక్' అవార్డులు

● ప్రకృతి సేద్యంలో ప్రగతికి గుర్తింపు

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో సాధించిన ప్రగతికి గుర్తింపుగా రాష్ట్రానికి ఐదు 'జైవిక్' అవార్డులు వచ్చాయి. రెండు రోజుల పాటు బెంగళూరులో జరిగిన ప్రకృతి వ్యవసాయ సదస్సులో జాతీయస్థాయిలో ఐదు విభాగాల్లో రాష్ట్రానికి దక్కిన అవార్డులను వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్ ఢిల్లీరావు గురువారం అందుకున్నారు. ఉత్తమ సేంద్రియ రైతు విభాగంలో ఏ రవీంద్ర (మన్యం) రూ.లక్ష, సీ లత (నంద్యాల) రూ.50 వేలు అవార్డు అందుకున్నారు. ఉత్తమ సేంద్రియ రైతు ఉత్పత్తిదారుల సంఘ విభాగంలో క్షేత్ర ప్రకృతి ఉత్పత్తిదారుల సంఘం (బాపట్ల), ఉత్తమ సేంద్రియ వ్యవసాయ పరిశోధన సంస్థ విభాగంలో ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ (పులివెందుల), ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక విధానాల రూపకల్పనలో ప్రభుత్వాలు... విభాగంలో ఏపీ రైతు సాధికార సంస్థ, బయో ఇన్‌పుట్స్ - జీవ వనరుల తయారీ విభాగంలో సుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరుల శిక్షణ కేంద్రం(ఏలూరు)కు అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం మరింత పెంచడానికి రైతులకు ప్రేరణగా, మార్గదర్శిగా జైవిక్ అవార్డులు నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

అమరావతికి శాశ్వతంగా వరద విముక్తికి చర్యలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రాజధాని అమరావతిలో శాశ్వత వరద విముక్తికి వీలుగా అమరావతి రాజధాని అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) మరో రెండు ముఖ్యమైన ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోంది. రాజధానికి వెళ్లే కరకట్ట రోడ్డుకు అనుసంధానంగా ప్రకాశం బ్యారేజీ సమీపంలో కొండవీడు వాగు పంపింగ్ స్టేషన్‌కు సమాంతరంగా మరో అదనపు పంపింగ్ స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న పంపింగ్ స్టేషన్ పక్కనే దీన్ని ఏర్పాటు చేస్తారు. అలాగే, ఉండవల్లి సమీపంలోని గ్రావిటీ కెనాల్ పంపింగ్ స్టేషన్‌కు సమాంతరంగా మరో పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తారు. ఈ రెండు పంపింగ్ స్టేషన్ల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. డీపీఆర్ రూపకల్పన కోసం గురువారం ఏడీసీఎల్ టెండర్లు పిలిచింది.

సచివాలయంలో నేతాజీకి ఘన నివాళి

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని పలువురు ఉన్నతాధికారులు ఘన నివాళులర్పించారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్ర, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, సీఎం కార్యదర్శులు ఏవీ రాజమౌళి, ప్రద్యుమ్న, బోస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. సచివాలయంలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ

ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ఏటా జనవరి 25న దేశ వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. రాష్ట్ర సచివాలయానికి ఈ నెల 25న సెలవుదినమైనందున 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని 24న శుక్రవారం ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి భవనం ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సచివాలయంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞలో పాల్గొని విజయవంతం చేయాలని మీనా కోరారు



ప్రపంచ రోలర్ బాస్కెట్ బాల్ పోటీలకు ధీరజ్ ఎంపిక

గుణదల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇండోనేషియా వేదికగా ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో జరగనున్న ప్రపంచ రోలర్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్‌లో నగరానికి చెందిన సాయి గౌతమ్ ధీరజ్ భారత దేశం తరఫున తలపడనున్నట్టు కోచ్ పతివాడ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఆర్. సాయి గౌతమ్ ధీరజ్ ఇటీవల మహారాష్ట్రలోని నాగపూర్ పట్టణంలో జరిగిన 4వ జాతీయ స్థాయి రోలర్ బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొని మ్యాన్ ఆఫ్ టోర్నమెంట్‌తో పాటు గోల్డ్ మెడల్ సాధించాడన్నారు.

27 నుంచి 8వ ఆహ్వాన నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తపస్వి కల్చరల్ ఆర్ట్స్ 8వ ఆహ్వాన నాటకోత్సవాలను ఈనెల 27 నుంచి 3 రోజుల పాటు గాంధీనగరంలోని హనుమంతరాయ గ్రంథాలయంలోని కళావేదికపై జరుగుతాయని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని 'నరసింహ నివాస్'లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజుకి రెండు నాటికలు ప్రదర్శితమవుతాయన్నారు. ఆంధ్ర నాటక కళా సమితి, కొడాలి బ్రదర్స్‌తో సంయుక్తంగా డాక్టర్ నందమూరి తారక రామారావు కళాపరిషత్ పేరిట ఈ ఆహ్వాన నాటకోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. సంస్థ కార్యదర్శి ఎస్.జగన్నాథరావు, బాయన శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్‌గిరీ కోసం పోటాపోటీ





● ఎస్సీ మహిళకు రిజర్వుతో టీడీపీ ఎస్సీ నేతల్లో ఆనందోత్సాహాలు

● సతీమణులతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం చుట్టూ ప్రదక్షిణలు

ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో తెలుగుదేశం ఎస్సీ నేతల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే తర్వాత అంత ప్రాధాన్యత ఉన్న పదవి ఇది. పేట ఏఎంసీ పరిధి చిల్లకల్లు సంతతో పాటు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతం వ్యవసాయాధారితం కావటంతో ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని నేతలు పదవి కోసం పోటీ పడుతున్నారు. గతంలో ఈ పరిధి జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలకే పరిమితం కాగా, గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గం మొత్తం పెనుగంచిప్రోలు, నందిగామ మండల పరిధిలో 10 గ్రామాలను కలిపేయటంతో పదవికి మరింత ప్రాధాన్యత లభించింది. గత ఐదేళ్లలో ఈ పదవి బీసీ మహిళ, జనరల్‌కు లభించగా, తొలిసారి ఎస్సీలకు, అందునా మహిళకు దక్కటం ఇదే ప్రథమం. దీంతో ఆయా వర్గాల నేతలు తమ సతీమణులను రంగంలోకి దించుతున్నారు. తమ సేవలను గుర్తించి అవకాశం ఇవ్వాలని ఎస్సీ సెల్ నేతలు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోదరులు, టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. పట్టణం నుంచి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ చైర్మన్ శ్రీరాం బదరీ నారాయణకు నమ్మిన బంటుగా, 30ఏళ్లుగా శ్రీరాం సోదరులతోనే కలిసి ప్రయాణం చేస్తున్న మాజీ ఏఎంసీ డైరెక్టర్ మల్లెల కొండ తన సతీమణి అంగన్‌వాడీ వర్కర్ సీతమ్మకు ఇవ్వాలని మునిసిపల్ కౌన్సిలర్లతో కలిసి నెట్టెం, తాతయ్యను కోరారు.

అలాగే కొండా సోదరుడు దివంగతబాబురావు జిల్లా స్థాయిలో ఎస్సీ సెల్ నేతగా కాంగ్రెస్‌లో పనిచేశారు. ఆయన సతీమణి చిట్టెమ్మ కౌన్సిలర్‌గా తాతయ్య వర్గం నుంచి ఎన్నికయ్యారు. తన కుటుంబ సేవలను గుర్తించి అవకాశం ఇవ్వాలని కొండా గట్టిగా కోరుతున్నారు. జగ్గయ్యపేట జడ్పీటీసీగా పనిచేసిన అమ్మనబోయిన రాణి, చిల్లకల్లు టీడీపీ ఎస్సీ నేత కారుపాటి డేవిడ్ తన సతీమణి, సర్పంచ్‌గా పనిచేసిన మణికి ఇవ్వాలని, ట్రేడ్ యూనియన్ నేత మాడుగుల సురేష్ తన సతీమణికి, పెనుగంచిప్రోలు నుంచి తాజాగా జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన ముండ్లపాటి జయమ్మకు ఇవ్వాలంటూ పెనుగంచిప్రోలు నేతలు తాతయ్య, రఘురాంను కోరారు. వత్సవాయి మండలంలో కన్నెవీడుకు చెందిన మాజీ ఎంపీటీసీ అయిన తన భార్యకు ఇవ్వాలని ఆదిమళ్ల రమేష్ కోరారు. బూదవాడ మాజీ సర్పంచ్ పొట్టిపొంగు బాబురావు సహా పలువురు ఎస్సీ నేతలు తమకు చాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో హోంగార్డు, యువకుడి మృతి

ఘంటసాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో హోం గార్డు, యువకుడు మృతి చెందిన సంఘటనలు గురువారం జరిగాయి. ఘంటసాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళాపురం గ్రామానికి చెందిన గొరిపర్తి యశ్వంత్ (20) మచిలీపట్నం హెడ్‌క్వార్టర్‌లో బుధవారం రాత్రి విధులు నిర్వహించుకుని గురువారం ఉదయం బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా 6.40 నిముషాలకు జీలగలగండి కాలనీ సమీపంలోని దెయ్యపు కాలువ వద్ద తెల్లటి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యశ్వంత్‌కు తీవ్ర గాయాలవగా మచిలీపట్నం ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. యశ్వంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. యశ్వంత్ తండ్రి శ్రీనివాస్ హోంగార్డుగా పనిచేస్తూ హార్ట్ ఎటాక్‌తో చనిపోగా, డిపార్ట్‌మెంట్ కుమారుడికి అవకాశం ఇచ్చింది. దీంతో యశ్వంత్ గత డిసెంబర్‌లో హోం గార్డుగా జాయినయ్యాడు. ఘంటసాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విలపిస్తున్న సుధీర్

జంక్షన్‌లో యువకుడి మృతి

హనుమాన్‌జంక్షన్: ఏలూరు జిల్లా పెదపాడు మండలం కడింకుంట గ్రామానికి చెందిన నక్కా క్రాంతి (19), అతడి బావమరిది పరిశే సుధీర్ ద్విచక్ర వాహనంపై విజయవాడ రోడ్డు నుంచి జంక్షన్ సెంటర్ వైపు వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న క్రాంతి లారీ కింద పడి దుర్మరణం చెందాడు. వాహనాన్ని నడుపుతున్న సుధీర్ ప్రాణాలతో బయటపడ్డాడు. యువకుడు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని జంక్షన్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ర్యాలీలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ఇంధన హబ్‌గా ఎన్టీఆర్ జిల్లా

గుణదల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాను పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. విద్యుత్‌శాఖ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఎనికేపాడులో గురువారం నిర్వహించిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన జనజాగృతి ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా ఎనికేపాడు నివాసి ఆర్.వీరరాఘవయ్య 15 రోజుల కిందట ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు. ఈ పథకం ద్వారా ఇంటి పైకప్పుపై అధిక రాయితీతో అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ బిల్ భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. రూ.2లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ.78వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రాయితీ మినహా మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందే అవకాశం ఉందన్నారు. దాదాపు 20 ఏళ్లపాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాల్లో 2 లక్షల కనెక్షన్లను లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 60 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, నోడల్ అధికారి ఎం.భాస్కర్, సర్పంచ్ ఆర్.పూర్ణచంద్రరావు, ఉప సర్పంచ్ టీవీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు

● విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో జిల్లాలోని 145 ప్రభుత్వ పాఠశాలలో క్రీడ కిట్ల పంపిణీ గురువారం నిర్వహించారు. గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చదివిన గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో లోకేష్ జన్మదినం సందర్భంగా క్రీడా కిట్లను పంపిణీ ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. ఆటల్లో బాగా రాణించాలన్న కారణంగా విద్యార్థులకు ఉపయోగపడేందుకు తన సొంత నిధులతో 145 ప్రభుత్వ పాఠశాలలో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి లాంగ్ జంప్ కిట్లను సిద్ధం చేయించినట్టు తెలిపారు. అనంతరం డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా కిట్లను అందజేయటంతో పాటు పాఠశాలల మైదానాలను అభివృద్ధికి కృషి చేసిన శివనాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. స్టేట్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ భానుమూర్తి, ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ హెడ్ మాస్టర్ మల్లిఖార్జునరెడ్డి, టీడీపీ నేతలు ఫతావుల్లా, గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు. గాంధీజీ మునిసిపల్ హైస్కూల్, గొల్లపల్లి నాగేశ్వరరావు మునిసిపల్ కార్పొరేషన్, దళవాయియి సుబ్బరామయ్య మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, పాదర్తి సుందరమ్మ బాలికల హైస్కూల్, మౌలానా అజాద్ మునిసిపల్ హైస్కూల్స్‌కు కిట్లను అందజేశారు.



క్రీడా కిట్లను అందచేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగ్గారావు

కౌలు రైతుల పేరుతోనే ఈ-క్రాప్

● వ్యవసాయ శాఖ డీడీ జగ్గారావు

గవర్నర్‌పేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కౌలు గుర్తింపు కార్డు లేకపోయినా వాస్తవంగా సాగు చేస్తున్న కౌలురైతుల పేరుతోనే ఈ-క్రాప్ నమోదు చేయాలని నిబంధనలు మార్పు చేసినట్టు వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగ్గారావు తెలిపారు. ఎంజీ రోడ్డులోని కౌలు రైతుల సంఘ రాష్ట్ర కార్యాలయంలో సంఘ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నిబంధన మార్పు గురించి వివరిస్తూ భూయజమాని పేరుతో ఈ-పంట నమోదైనప్పటికీ మార్పు చేయడానికి, కౌలురైతుల పేర్లు నమోదు చేయడానికి అవకాశం ఉందన్నారు. పొరపాటున కౌలు రైతుల స్థానంలో భూ యజమాని పేరు నమోదు చేసినా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సరిచేయించే బాధ్యత కౌలు రైతుల సంఘం తీసుకోవాలన్నారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ విడుదల చేసిన కొన్ని జీవోలు, నిబంధనల మార్పు గురించి వివరించారు. వివిధ జిల్లాలకు చెందిన కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగలకొట్టి చోరీ

● రూ.11.50 లక్షల నగదు, 15 గ్రాముల బంగారం అపహరణ

● నిందితుల కోసం పోలీసుల గాలింపు

గుణదల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలో భద్రపరచిన రూ.11.50 లక్షల నగదు, 15 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన గుణదల మురళీనగర్లో బుధవారం అర్ధరాత్రి జరిగింది. కాల్వకట్టమీద నివాసముంటున్న తానికాటిల్ రామ్మోహన్ రావు (40) రామవరప్పాడు బల్లెంవారి వీధిలోని ఆర్ ఆర్ దర్బార్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. కొన్నేళ్ల క్రితం తల్లిదండ్రులు చనిపోగా, అక్కకు వివాహం చేసేందుకు నగదు, బంగారు ఆభరణాలు ఇంట్లోనే జాగ్రత్త చేస్తున్నాడు. విశాఖపట్నంలో వీరి బంధువు ఒకరు చనిపోవడంతో ఇంటికి తాళం వేసి ఈనెల 20న అక్కతో కలిసి వెళ్లి గురువారం ఉదయం ఇంటికి తిరిగి రాగా ఇంటితాళాలు పగలకొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలకొట్టి ఇల్లంతా చిందరవందరగా ఉంది. గుణదల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, సెంట్రల్‌జోన్ ఏసీపీ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. ప్రత్యేక బృందాలతో గాలింపు ప్రారంభించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుణదల సీఐ తెలిపారు.



చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ ఏసీపీ, గుణదల సీఐ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీసీపీ నాయుడు, డీటీసీ మోహన్

వాహనం నడపటంపై దృష్టి పెట్టాలి

● డీసీపీ కృష్ణమూర్తి నాయుడు

కృష్ణలంక, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నడిపేటప్పుడు మనస్సు శరీరం ఒకటిగా చేసుకొంటూ వాహనం నడపడంపై దృష్టి పెట్టాలని డీసీపీ కృష్ణమూర్తి నాయుడు హితవు పలికారు. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో 'లార్జ్ అర్బన్ ఏరియా ట్రాఫిక్ వలంటీరింగ్' వారోత్సవాల ముగింపు గురువారం నిర్వహించారు. డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, డీటీసీ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను, కారు నడిపేవారు సీట్ బెల్టని ధరించి వాహనాలు నడపాలన్నారు.డీటీసీ మోహన్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం యువ అధికారి సుంకర రాము మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాలు ఈ నెల 17 నుంచి 23 వరకు, అర్బన్ ఏరియా ట్రాఫిక్ వలంటీరింగ్ ప్రోగ్రాంను నిర్వహించామన్నారు. సిద్ధార్థ విద్యార్థులు, విజయ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫర్ ఉమెన్, కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, 500 మంది మై భారత్ వలంటీర్స్ పాల్గొన్నారన్నారు. అనంతరం డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, డీటీసీ ఎ.మోహన్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివరామ్‌గౌడ్, పెనమలూరు సబ్ ఇన్‌స్పెక్టర్ లంక సురేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి కోళ్ల నరేంద్ర, మై భారత్ వలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌కు బెజవాడ గొప్ప ఉదాహరణ

● పోలీసులపై సీఎం ప్రశంసలు

విజయవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు విజయవాడ పోలీసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రజల భాగస్వామ్యంతో 1000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడం, ప్రజలతో సురక్ష కమిటీలను ఏర్పాటు చేయడం, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన పెంచడానికి హైటెక్ ఈగల్ వాహనాలను రహదారులు పైకి తీసుకురావడాన్ని ఆయన ఎక్స్‌లో అభినందించారు. టెక్నాలజీని ఉపయోగించుకుని సురక్షిత వాతావరణాన్ని ప్రజలకు అందించడానికి ఇదొక గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు విజయవాడ గొప్ప ఉదాహరణని పేర్కొన్నారు.

● సత్కారం



విజయవాడలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్ఎల్‌వీ గ్రూపు చైర్మన్ పెనుమత్స శ్రీనివాసరాజు బుధవారం రూ.20లక్షలు విరాళంగా ఇచ్చారు. నగరంలో జరిగిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ఆయన్ను డీజీపీ ద్వారకా తిరుమలరావు, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సత్కరించారు. - వన్‌టౌన్, ఆంధ్రజ్యోతి



టెన్త్ తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి టీచర్లు కృషి చేయాలి

● టెన్త్ స్టడీ మెటీరియల్ పుస్తకం ఆవిష్కరణ

గవర్నర్‌పేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విశేష అనుభవమున్న సీనియర్ టీచర్లు తయారు చేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు అన్నారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని గురువారం విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను మాట్లాడుతూ సమాధానాలతో కూడిన మోడల్ ప్రశ్నాపత్రాల పుస్తకాన్ని రూపొందించామన్నారు. అన్ని జిల్లాల్లో నమూనా కాపీలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. సంఘ రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ నేతలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భానుమూర్తి రాజు

నేటినుంచి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం


లబ్బీపేట (స్పోర్ట్స్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా అండర్-14 బాలబాలికల టోర్నమెంట్ శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ కార్యదర్శి భానుమూర్తి రాజు తెలిపారు. గురువారం పటమటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ టోర్నీ నిర్వహణకు విజయవాడ నగరం అతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. రెండు ఫ్లడ్‌లైట్ల కోర్టుల్లో జరిగే ఈ టోర్నీ లీగ్, నాకౌట్ పద్ధతిలో జరుగుతుందన్నారు. క్రీడాకారులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, 12 రాష్ట్రాల క్రీడాకరారులు ఈ టోర్నీలో పాల్గొంటున్నారని, ఇప్పటికే వారు నగరానికి చేరుకోగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అధికారులు పాల్గొంటారన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టోర్నీ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.



శిక్షణలో పాల్గొన్న మహిళా సమాఖ్య అధ్యక్షులు

స్వయం సహాయక సమాఖ్య అధ్యక్షులకు ముగిసిన అవగాహన సదస్సు

వన్‌టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సు గురువారం ముగిసింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నందిగామ, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన 16 మండలాల స్వయం సహాయక సమాఖ్య అధ్యక్షులతో పాటు 30 మంది పాల్గొన్నారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ లైవ్‌లీ గుడ్ మిషన్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా రాణి, ఎన్.ఆర్.ఎం. ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ బాబూరావు, మురళీధర్ వికసిత పంచాయత్ లక్ష్యంలో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేయటంపై అవగాహన కల్పించారు. ఎన్టీఆర్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కందుల కల్పన ఆధ్వర్యంలో మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.



నూతన భవనంలో రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందుకుంటున్న యజమాని

31 వరకే బీఫారం రిజిస్ట్రేషన్లు

చిట్టినగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వీఎంసీ పరిధిలోని పాయకాపురం కాలనీలు, కొత్త రాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో బీ-ఫామ్ పట్టాల రిజిస్ట్రేషన్ (వీఎంసీ) ఈనెల 31 వరకు జరుగుతాయని ఇంకా రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనంలో రాజరాజేశ్వరిపేట, పాయకాపురం ప్రాంతాలకు చెందిన పలువురి పట్టాల రిజిస్ట్రేషన్ జరిగింది. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో నూతన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు ప్రత్యేక రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేస్తున్నారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, పదేళ్లుగా యజమానులుగా ఉంటున్న వారికి గజం రూ.100 చొప్పున తీసుకోవడం జరుగుతుందన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500



రీ సర్వే పనుల పరిశీలన

పెదపారుపూడి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూముల రీ సర్వే పనులను సర్వే ఉప పరిశీలకుడు జె.బి.బాబు గురువారం పరిశీలించారు. పాములపాడు గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేలో భూమి హద్దులు, కొలతలు, విస్తీర్ణం, పటం, భౌగోళిక గుర్తులు, భూమి తరం, దానిపైన శిస్తు వివరాలను రైతుల నుంచి తెలుసుకుని అనంతరం రీ సర్వే చేపట్టారు. ఈ సర్వేలో రీ సర్వే డీటీ సుందరరావు, మండల సర్వేయర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



పాములపాడులో రీ సర్వే పనులను పరిశీలిస్తున్న సర్వే ఉప పరిశీలకుడు జె.బి.బాబు

ఉపాధి పథకంతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న డ్వామా పీడీ శివప్రసాద్

పామర్రు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసాను, జీవన భద్రతను కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యమని డ్వామా పీడీ బి.శివప్రసాద్‌యాదవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర ఉపాధిహామి సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యాల మేరకు కూలీలకు పనిదినాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలని ఆయన సూచించారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ వందరోజుల పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. జాబ్‌కార్డు ఉన్న వారందరూ పనులకు వచ్చే విధంగా గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలని అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ నాంచారరావు సూచించారు. పామర్రు ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీఎం సురేష్, ఎంపీడీవో కె.జ్యోతి, ఈవోపీఆర్డీ కిషోర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



గుడ్లవల్లేరు పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందుల లభ్యత, కొరత వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీపీ బాధితుల కో సం ఏ జాగ్రత్తలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. గోల్డెన్ హవర్‌లో చేసే ఇంజ క్షన్ అందుబాటులో ఉందా అని అడిగారు. గుడివాడ, పామర్రు, మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రుల్లోనే అందుబాటులో ఉన్నాయని సిబ్బంది చెప్పడంతో ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే అన్నారు. డాక్టర్ యశస్విని, చాపరాల బాలాజీ, సి.రాజేశ్వరరావు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వెంకటాద్రి పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు రుణమాఫీ చేయండి

● టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి అరుణ

గుడివాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన హామీ మేరకు టిడ్కో ఇళ్లకు అసలు, వడ్డీ మొత్తం రుణమాఫీ చేయాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ డిమాండ్ చేశారు. గురువారం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో నిర్వహించిన కమిటీ ప్రథమ మహాసభలో ఆమె మాట్లాడారు. ఏడాది కాలంగా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నామన్నారు. 26 డిమాండ్లతో మహాసభలో తీర్మానించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు కమిటీ సభ్యులు, టిడ్కో లబ్ధిదారులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుటుంబానికో వ్యాపారవేత్తను తయారుచేయడమే మెప్మా లక్ష్యం

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

గుడివాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 100 రోజుల జీవనోపాధి జాతర కార్యక్రమానికి మెప్మా శ్రీకారం చుట్టిందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రతి కుటుంబానికి 100 శాతం కుటుంబపోషణకు ఉపయోగపడేలా రూపొందించిన యాక్షన్ ప్లాన్ పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. సీఎంఎం బసవేశ్వరరావు, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.



ఎస్పీఎస్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంవీఐ సంగీతరావు

హెల్మెట్ తప్పనిసరి

గుడివాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని రవాణా శాఖ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సంగీతరావు అన్నారు. గురువారం ఎస్పీఎస్ ఉన్నత పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారి భద్రతా ప్రచార వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే జరిగే నష్టాలపై టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్‌తో కలిసి విద్యార్థులకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నరాజు, ఏఎస్సై గోవర్ధనరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పీఈటీ మడకా ప్రసాద్ పాల్గొన్నారు.



తాడంకి హైస్కూల్‌కు కంప్యూటర్ అందజేస్తున్న ఐడీబీఐ బ్యాంకు ఏజీఎం వలిపే చందన్, మేనేజర్ కిరణ్‌కుమార్

పాఠశాలకు కంప్యూటర్, ఫర్నీచర్ వితరణ

పమిడిముక్కల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ఉయ్యూరు ఐడీబీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.65వేలు విలువైన కంప్యూటర్, బీరువా, ఇతర ఫర్నీచర్ గురువారం అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద పాఠశాలకు అవసరమైన కంప్యూటర్, ఫర్నిచర్‌ను హెచ్‌ఎం వైఎస్ఎన్ ప్రసాద్‌కు బ్యాంకు ఏజీఎం వలిపే చందన్, బ్రాంచి మేనేజర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ బి.వీరాంజనేయులు అందజేశారు. పాఠశాల ఎస్ఎంసీ వైస్ చైర్మన్ కాండ్రు శేఖర్, టీడీపీ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు పులి శ్రీనివాసరావు, పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ సీహెచ్ రవికుమార్, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరాలు

కోడూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి దేవాలయంలో హుండీ దొంగతనం చేసిన దొంగను సీసీ కెమెరాలు పట్టించాయని ఎస్ఐ కె.చాణక్య తెలిపారు. బుధవారం అయ్యప్పస్వామి దేవాలయంలో హుండీని దొంగిలించారని ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ ఫిర్యాదు చేయడంతో ఆలయం వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించి హుండీ దొంగిలించిన తమ్ము వీరరాఘవయ్యను 24 గంటల్లోనే అదుపులోకి తీసుకున్నామని, నగదు రికవరీ చేశామని తెలిపారు. వీరరాఘవయ్యపై కేసు నమోదు చేశామన్నారు. మండల పరిధిలోని ప్రతీ దేవాలయం, మసీదులు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

కోతుల బెడద

● రక్షించాలని కోరుతున్న చినముత్తేవి గ్రామస్థులు

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి): గుంపులుగుంపులుగా వస్తున్న కోతులు తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని, కూరగాయలు, పండ్ల మొక్కలు నాశనం చేస్తున్నాయని చినముత్తేవి గ్రామస్థులు వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులపై దాడిచేసి గాయపరుస్తున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి కోతుల బెడద నుంచి విముక్తి కలిగించాలని వారు కోరుతున్నారు. అరటి, బొప్పాయి, జామ, కొబ్బరి పంటలను నాశనం చేయటంతోపాటు ఇళ్లలోని వస్తువులను చిందర వందర చేస్తూ నష్టాన్ని కలుగజేస్తున్నాయంటున్నారు. దుకాణాలు, హోటళ్లు, బడ్డీకొట్ల వద్ద కోతులు గుంపులుగా చేరి భయపెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బారి నుంచి తమను రక్షించాలని అధికారులను వేడుకుంటున్నారు.



చినముత్తేవిలో ఇళ్ల వద్ద గుంపులుగా సంచరిస్తున్న కోతులు

ఘనంగా నారా లోకేశ్ జన్మదినోత్సవం



గుడివాడలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, నాయకులు



పామర్రులో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

గుడివాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'విద్య, సాంకేతిక రంగాల్లో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారు. లోకేశ్ నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉంది.' అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలను పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, నాయకులు రాంబాబు, మురళీ, దానేటి సన్యాసిరావు, లింగం ప్రసాద్, గుడివాడ జోన్స్, ముళ్లపూడి రమేష్, మాదాల సునీత, తులసీ రాణి, జనసేన నాయకులు మజ్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

టీం లోకేశ్ ఆధ్వర్యంలో అన్నదానం

మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా అన్న క్యాంటీన్‌లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, టీం లోకేశ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నాయకులు దింట్యాల రాంబాబు, లింగం ప్రసాద్, పోలాసి ఉమా, సయ్యద్ జబీన్, మురళీ, టీం లోకేశ్ మచిలీపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జ్ వేగే వెంటకతరుణ్, సతీష్‌బాబు, హేమంత్ పాల్గొన్నారు.

లోకేశ్‌కు చల్లని దీవెనలందించండి: ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు: టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీ కేడర్‌కు అండగా నిలిచి, ప్రజాసమస్యలపై పాదయాత్ర ద్వారా పోరాటం చేసి, రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించిన మంత్రి నారా లోకేశ్‌కు చల్లని దీవెనలందించి, ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కోరారు. టీడీపీ కార్యాలయంలో గురువారం లోకేశ్ జన్మదిన వేడుకలను కార్యకర్తలు, నేతలతో కలిసి ఆయన నిర్వహించారు. కేక్ కట్ చేశారు. నిరుపేదలకు దుస్తులు, చీరలను పంచిపెట్టారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేశ్, కృష్ణా డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, పరస సుబ్రహ్మణ్యం, చాట్ల రమేష్, దాలిపర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

లోకేశ్ జన్మదిన వేడుకల్లో భాగంగా అడ్డాడ, ఐనంపూడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఐనంపూడి మాజీ సర్పంచ్ బొప్పన భరత్‌కుమార్ దంపతులు ప్యాడ్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను వితరణగా అందించారు. అడ్డాడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డి.పద్మజ తదితరులు పాల్గొ న్నారు.



గుడివాడ అన్న క్యాంటీన్‌లో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు



అడ్డాడ హైస్కూల్లో విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న బొప్పన భరత్‌కుమార్



గుడ్లవల్లేరులో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ఆదర్శనీయుడు నేతాజీ

గుడ్లవల్లేరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ధైర్య సాహసాలకు ప్రతీక నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని, ఆయనను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. గురువారం గుడ్లవల్లేరులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలుత జాతీయ జెండా ఆవిష్కరించారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేశారు. చాపరాల రాజేశ్వరరావు, వల్లభనేని వెంకటరావు, చాపరాల బాలాజీ, దావులూరి సురేంద్రబాబు, ఈడే మోహన్, యెనిగళ్ల నాగేశ్వరరావు,రాంబాబు, మురాల నరేష్, ఎంపీడీవో విజయసారథి, పంచాయతీ సెక్రటరీ నరసింహారావు పాల్గొన్నారు.



కాకర్ల వీధిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నేతాజీ గొప్పతనాన్ని భావితరాలు తెలుసుకోవాలి

గుడివాడ: నేతాజీ గొప్పతనాన్ని భవిష్యత్ తరాలు తెలుసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్ సూచించారు. గురువారం నేతాజీ జయంతి సందర్భంగా కాకర్ల వీధిలోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు తేజ, దేవరపల్లి చిన్న, శీలం శంకర్రావు, రవి ప్రసాద్, గానుగుల రాజా, గోపిక, రీటా పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

నేతాజీ జయంతి సందర్భంగా గురువారం టౌన్ హైస్కూల్‌లో ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. తొలుత నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవసరమైన విద్యార్థులకు కళ్లజోళ్లను ఉచితంగా అందించారు. క్లబ్ ఎలక్ట్ గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, పూర్వ గవర్నర్ పర్వతనేని చంద్రశేఖర్, డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఆంజనేయులు, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

గుడివాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): చదువుతోనే బంగారు భవిష్యత్తు అని, బాలికలు చదువుకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించాలని, పేదరిక నిర్మూలనకు చదువే ఆయుధమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు బాలికోన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ వైద్యుడు డాక్టర్ గోరంట్ల వాసుబాబు దాతృత్వంతో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగశాలను కుమార్తె, ఎఫిషియన్సీ సొల్యూషన్స్ ఎండీ వెనిగండ్ల ప్రత్యూషతో కలిసి ప్రారంభించారు. ప్రయోగశాలలోని అత్యాధునిక, సాంకేతిక పరికరాల గురించి అధ్యాపకులు ఎమ్మెల్యేకు వివరించారు. విద్యార్థులు ప్రయోగశాలను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ల్యాబ్‌ను ఏర్పాటుచేసిన దాతలను ఆయన అభినందించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యలవర్తి శ్రీనివాసరావు, చేకూరు జగన్మోహనరావు, అల్లాడ శ్రీనివాసరావు, తానా మాజీ అధ్యక్షుడు అంజయ్య చౌదరి, ఎంఈవోలు విజయ్, బాలాజీ, ప్రధానోపాధ్యాయులు ప్రమీలారాణి పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములవ్వాలి

గుడివాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా సాగుతున్న రాష్ట్రానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు అండగా నిలవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. గురువారం రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో కృష్ణాజిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన టేబుల్ క్యాలెండర్-2025ను ఆయన ఆవిష్కరించారు. ఎన్‌జీవోస్ అసోసియేషన్ గుడివాడ తాలుకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కె.పి.రావు, జి.రాజేంద్రనగర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ ఫరీద్‌బాషా, మహిళ అధ్యక్షురాలు నిర్మల, సంయుక్త కార్యదర్శులు వెంకట్రావు, మనోజ్, కోశాధికారి పి.వి.ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

28న మెగా జాబ్‌మేళా

అవనిగడ్డ రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 28న అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, వైఎస్కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలలోపు వారు అర్హులని తెలిపారు.

బొడ్డు నాగయ్య జూనియర్ కళాశాలలో..

పెడన: జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.సురేష్‌కుమార్ తెలిపారు. 10, ఐటీఐ ఫిట్టర్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. మోహన్ సింటెక్స్, ఇండియా లిమిటెడ్, వైఎస్‌కే ఇన్‌ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులను ఇంట ర్వ్యూ చేస్తారన్నారు. 94404 44033కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

తోట్లవల్లూరు ఎస్సైగా అవినాశ్

తోట్లవల్లూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు ఎస్సైగా సీహెచ్ అవినాశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తోట్లవల్లూరు ఎస్సైగా పనిచేసిన ఎం.అర్జునరాజును వీఆర్‌కు పంపడంతో పామర్రులో పనిచేసి వీఆర్‌లో ఉన్న అవినాశ్‌ను తోట్లవల్లూరుకు పంపించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సీహెచ్ అవినాశ్

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.500

రేపు విద్యుత్ అదాలత్

పెడన/పెడన రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోటమూల ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఏడీఈ సీహెచ్ఆర్ఆర్ మాణిక్యాలరావు తెలిపారు. పెడన నియోజకవర్గంలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన ప్రజలు విద్యుత్ సమస్యలపై లిఖితపూర్వకంగా అర్జీలు అందజేయాలని ఆయన సూచించారు. అదాలత్‌కు గ్రీవెన్స్ రెడ్రెసెల్ ఫోరం ఛైర్మన్ ఎస్.విక్టర్ ఇమానుయేలు హాజరవుతారన్నారు. విద్యుత్ అంతరాయం, హెచ్చుతగ్గులు, మీటరు ఇబ్బందులు, అధిక బిల్లులు రావడం తదితర సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.







బంటుమిల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, చల్లపల్లిలో 42 కిలోల కేక్ కట్‌చేస్తున్న ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు, టీడీపీ మచిలీపట్నం కార్యాలయం, కొడాలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా నారా లోకేశ్ జన్మదినోత్సవం

బంటుమిల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు.

మచిలీపట్నం నియోజకవర్గంలో..

మచిలీపట్నం టౌన్: టీడీపీ మచిలీపట్నం నియోజకవర్గ కార్యాలయం, వివిధ గ్రామాల్లో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు నిర్వహించారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో బాబా ప్రసాద్, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము కేక్ కట్ చేశారు. చిన్నాపురంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు, కానూరులో తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని పేదలకు తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ వస్త్రదానం చేశారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో..

అవనిగడ్డ/మోపిదేవి/చల్లపల్లి/నాగాయలంక /ఘంటసాల/కోడూరు: టీడీపీ అవనిగడ్డ కార్యాలయంలో కేక్ కట్ చేసి మంత్రి లోకేశ్ పుట్టినరోజు వేడుకలను టీడీపీ నేత, ఎన్ఆర్ఐ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే కనకదుర్గ, కర్రా సుధాకర్ పాల్గొన్నారు. మోపిదేవిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో టీడీపీ నేతలు పూజలు చేశారు. స్వామికి మొక్కులు చెల్లించారు. పార్టీ కార్యాలయం వద్ద కేక్‌ను పార్టీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, రావి రత్నగిరి కట్ చేశారు. కొడాలిలోని పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, మొవ్వ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు తుమ్మల జనార్దన్‌బాబు, తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి సురేష్ పేర్కొన్నారు. కేక్‌ను కట్ చేశారు. నాగాయలంక ప్రధాన సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉప్పల ప్రసాద్, తలశిల నాని పాల్గొన్నారు. చల్లపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు ఆధ్వర్యంలో ఎన్నారై బొబ్బా గోవర్ధన్ 42 కిలోల భారీ కేక్‌ను కట్‌చేశారు. ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో నారా లోకేశ్ సేవాసమితి అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మధుసూదనరావుల ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎన్నారై బొబ్బా గోవర్ధన్ పాల్గొన్నారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్ పాల్గొన్నారు.



అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న బొబ్బా గోవర్ధన్

బుద్ధప్రసాద్‌కు వివేకానంద జీవనసాఫల్య పురస్కారం

అవనిగడ్డ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందుకున్నారు. రామకృష్ణ మిషన్ రాజమండ్రి అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పురస్కారాన్ని అందించారు.



పురస్కారం అందుకుంటున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



క్రీడా పోటీల విజేతలతో డీఎస్పీ విద్యశ్రీ

విలువలతో కూడిన విద్యాభ్యాసంతో విజయం తథ్యం

అవనిగడ్డ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యాభ్యాసం చేస్తే విజయం తథ్యమని డీఎస్పీ విద్యశ్రీ అన్నారు. సంక్రాంతి సంబరాల సందర్భంగా వీర్నాల ఫౌండేషన్ నిర్వహించిన పోటీల్లో అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులను ఫౌండేషన్ తరఫున డీఎస్పీ అందజేశారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన బాలుర కబడ్డీ జట్టుకు రూ.25 వేలు, బెస్ట్ రైడర్‌గా ఎంపికైన ఎస్.చరణ్‌కు రూ.10 వేలు, బాలికల కబడ్డీలో మూడవ స్థానం పొందిన జట్టుకు రూ.10 వేలను అందజేశారు. విద్యాకమిటీ ఛైర్మన్ ఎం.మణిబాబు, హెచ్ఎం జీఎస్‌బీ గోపాల్, పీడీలు ఎస్.శ్రీకాంత్, ఎ.భానుప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

చల్లపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రులను, క్లినిక్‌లను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.శర్మిష్ఠ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలించి వైద్యులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయకుండా ఆస్పత్రులు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యఆరోగ్యశాఖ నిబంధనలను పాటించాలన్నారు.



చల్లపల్లిలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.శర్మిష్ఠ

జిల్లా ఆస్పత్రిలో స్కిల్ ల్యాబ్ ప్రారంభం

మచిలీపట్నం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స సీపీఆర్ అత్యంత కీలకమని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత అన్నారు. గురువారం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. సీపీఆర్, హృదయశ్వాస పునరుజ్జీవంపై అవగాహన కల్పించారు. ఆర్ఎంవో నిరంజన్, డిప్యూటీ సూపరింటెండెంట్ భరత్‌సింగ్‌నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరాలు

కోడూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి దేవాలయంలో హుండీ దొంగతనం చేసిన దొంగను సీసీ కెమెరాలు పట్టించాయని ఎస్ఐ కె.చాణక్య తెలిపారు. బుధవారం అయ్యప్పస్వామి దేవాలయంలో హుండీని దొంగిలించారని ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ ఫిర్యాదు చేయడంతో ఆలయం వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించి హుండీ దొంగిలించిన తమ్ము వీరరాఘవయ్యను 24 గంటల్లోనే అదుపులోకి తీసుకున్నామని, నగదు రికవరీ చేశామని తెలిపారు. వీరరాఘవయ్యపై కేసు నమోదు చేశామన్నారు. మండల పరిధిలోని ప్రతీ దేవాలయం, మసీదులు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

పాడిరైతులకు రాయితీపై పశుగ్రాసం, ప్రమాదబీమా

మోపిదేవి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో రాయితీపై పశుగ్రాసం, మిశ్రమ దాణా, ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. మేలైన పశుసంతతిని వృద్ధి చేయాలనే లక్ష్యంతో పశువైద్యశాలల ద్వారా రైతులకు అనేక రాయితీలిస్తోంది. వైద్యుల సూచనలమేరకు పశుపోషణ చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది.' అని మండల పశువైద్యాధికారి డాక్టర్ నంద కిషోర్ సూచించారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మోపిదేవిలంక, కోసూరువారిపాలెం గ్రామాల్లో గురువారం ఉచిత పశువైద్య శిబిరాలను సర్పంచ్‌లు మోర్ల జ్యోత్స్న, కోసూరు అనూష ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యులు దిడ్ల రాణి, సనకా వెంకట రాజేష్, పశుసంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో ర్యాలీలో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ ఏవీ శివకుమార్

హెల్మెట్ విధిగా ధరించాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు ప్రయాణాలు చేస్తున్నప్పుడు హెల్మెట్ విధిగా ధరించాలని ట్రాఫిక్ సీఐ ఏవీ శివకుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం కోనేరుసెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. శివకుమార్‌తో పాటు బాలసాయి డిగ్రీ కళాశాల ఫౌండేషన్ ప్రతినిధి శ్వేత, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వరరావు, బాలసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ పాల్గొన్నారు. ర్యాలీ కోనేరు సెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు సాగింది.

సబ్‌జోన్ ఆటల పోటీలు ప్రారంభం

నాగాయలంక, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తలగడదీవి జడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా సెకండరీ స్కూల్ గేమ్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 84వ అవనిగడ్డ సబ్‌జోన్ బాలుర ఆటలు పోటీలను గురువారం ఎంపీపీ భోగాది రాఘవరాణి, మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. ఈనెల 25వరకు నిర్వహించే ఈ పోటీల్లో సబ్‌జోన్ పరిధిలో 58 టీమ్‌లు ఆడనున్నాయి. మొదటి రోజున అండర్-17 సీనియర్ విభాగంలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీవో జేవీ సీతారామ్‌కుమార్, సర్పంచ్ భోగాది వెంకటేశ్వరరావు, తలశిల స్వర్ణలత, వర్రే రాంబాబు, మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, టీవీఎం రామదాసు, బి.శివరామప్రసాద్, సీహెచ్ వీ సుబ్బారావు పాల్గొన్నారు. జి.మారుతి, కె.పూర్ణచంద్రరావు, టీఎస్ రత్నకుమారి, ఆరు మండలాల పీడీలు ఆడించారు.



తలగడదీవి హైస్కూల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ భోగాది రాఘవరాణి, మండలి వెంకట్రామ్

క్రీడలతో మానసికోల్లాసం

కృత్తివెన్ను: క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం సంగమూడి హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి, ఒడుగు తులసీరావు, నాగమల్లేశ్వరరావు, కూనసాని శ్రీనివాసరావు, బస్వాని బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.




సంగమూడి హైస్కూల్‌లో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

28న మెగా జాబ్‌మేళా

అవనిగడ్డ రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 28న అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, వైఎస్కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలలోపు వారు అర్హులని తెలిపారు.

బొడ్డు నాగయ్య జూనియర్ కళాశాలలో..

పెడన: జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.సురేష్‌కుమార్ తెలిపారు. 10, ఐటీఐ ఫిట్టర్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. మోహన్ సింటెక్స్, ఇండియా లిమిటెడ్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారన్నారు. 94404 44033కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.



కానిస్టేబుల్ పరీక్షకు ఎంపికైన హోంగార్డులకు పోటీ పరీక్షల మెటీరియల్ అందిస్తున్న ఎస్పీ గంగాధరరావు

పోటీ పరీక్షల మెటీరియల్ అందజేత

మచిలీపట్నం టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించిన హోంగార్డులకు గురువారం ఎస్పీ గంగాధరరావు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. మోటారు ట్రాన్స్‌పోర్టు సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు హోంగార్డులు ఇటీవల నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. హోంగార్డులను ఎస్పీ అభినందించారు. కాకినాడలోని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌తో మాట్లాడి ఉచితంగా మెటీరియల్ అందజేశారు. ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ, ఆర్ఐలు రవికిరణ్, సతీష్‌కుమార్, డి.రాఘవయ్య, రవికుమార్, ఆర్ఎస్ఐ కిరణ్ పాల్గొన్నారు.



అబ్దుల్ హఫీజ్



కొండపల్లి శ్రుతి



ఎం.భానుబాబు

ఒలింపియాడ్‌లో చల్లపల్లి రాజా

హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

చల్లపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హమ్మింగ్ బర్డ్ ఇంటర్నేషనల్ - న్యూఢిల్లీ నవంబరులో నిర్వహించిన ఒలింపియాడ్ 2024 - 25 పరీక్షల్లో చల్లపల్లి రాజా హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి పతకాలు సాధించారు. హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి అబ్దుల్ హఫీజ్, 9వ తరగతి విద్యార్థిని కొండపల్లి శ్రుతి ఇంగ్లీష్‌లో, 8వ తరగతి విద్యార్థి మునిపల్లి భానుబాబు యాటిట్యూడ్ అండ్ రీజనింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. 8వ తరగతి విద్యార్థులు సీహెచ్ హేమంత్, జితేంద్ర, జి.పవన్, అబ్దుల్ ఇబ్రహీం ఖాన్ వెండి పతకాలు, ఎ.హారిక, టి.మేఘన, అబ్దుల్ మెహబూబ్ ఉన్నీసాలు రజత పతకాలు సాధించారు. ఉపాధ్యాయుడు టి.రేణుప్రసాద్ శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం ఎస్ఎస్‌డీ.ప్రసాద్ అభినందించారు.

దేశభక్తుడు నేతాజీ

కోడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం అమరులయినా పర్వాలేదు. మన సమాధులే మెట్లుగా స్వాతంత్ర్య సాధన వైపు అడుగులు పడితే చాలు అనుకున్న గొప్ప దేశభక్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఉపాధ్యాయుడు కాశీభట్ల నాగభూషణం అన్నారు. గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కోడూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నాగాయలంకలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నేతలు

నాగాయలంక: నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి కార్యక్రమం నాగాయలంకలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం సెంటర్‌లో నిర్వహించారు. బోస్ విగ్రహానికి తహసీల్దార్ ఎం.హరనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో జె.వి.సీతారామకుమార్, డీటీ అబ్దుల్ రఫీ, తలశిల స్వర్ణలత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నాగాయలంక, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పర్రచివర శివారు బిల్లీ గ్రాహంనగర్‌లో ఇటీవల గుర్రం స్వామేరు ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. గురువారం బాధితులను మండలి వెంకట్రామ్ పరామర్శించి రూ.5 వేలు, నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా పక్కా గృహం మంజూరుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తారని తెలిపారు. డీసీ ఛైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, తలశిల శివరామకృష్ణ, మంచాల తిరుపతి వరప్రసాద్ పాల్గొన్నారు.

రామకృష్ణాపురం పాఠశాలను హైస్కూల్‌గా మార్చేందుకు కృషి చేస్తా

- తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు



దేవనబోయిన వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

కోడూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాలను హైస్కూల్‌గా ఉన్నతీకరించడానికి కృషి చేస్తానని తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పాఠశాలను ఆయన సందర్శించారు. పీసీ ఛైర్మన్‌ను పాఠశాల యాజమాన్య కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. అద్దంకి పాండురంగారావు, పాఠశాల కమిటీ ఛైర్మన్ అద్దంకి ఉష, ప్రధానోపాధ్యాయులు కారాని నాగార్జున పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షకు 299 మంది హాజరు

పెడన రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్-2025 పరీక్షలు నిర్వహించారు. గురువారం ఉదయం147 మందికి 146, మధ్యాహ్నం 158 మందికి 153 మంది హాజరయ్యారని నిర్వాహకుడు పి.అశోక్‌కుమార్ తెలిపారు.